అస్తవ్యస్తంగా ఉపాధి పనులు

- పనుల కొలతల్లో తేడాలు
- ఒకే ఇంట్లో రెండు జాబ్‌కార్డులు
- మస్టర్లలో మాయాజాలం
- టీఏల డైరెక్షన్లోనే అవకతవకలు
- రూ.74 లక్షల రికవరీకి ఆదేశాలు

పొదలకూరు: మండలంలో ఉపాధి పనులు అస్తవ్యస్తంగా మారాయి. గత ఆర్థిక సంవత్సరంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలో పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ శాఖల ద్వారా జరిగిన ఉపాధి పనుల్లో నిధులు భారీగా దుర్వినియోగమయ్యాయని ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో అధికారులు నిగ్గుతేల్చారు. ఒకే ఇంట్లో రెండు జాబ్ కార్డులు ఎక్కువగా ఉన్నాయని తేల్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మస్టర్లలో మాయాజాలం చోటుచేసుకుంటోందనే విమర్శలున్నాయి. ప్రస్తుతం పనులకు హాజరయ్యే కూలీల ముఖాలను ఫొటో తీసి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండటంతో అవకతవకలు కొంత మేర కట్టడి అయ్యాయని సమాచారం. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.17.1 కోట్ల పనుల్లో కొలతల్లో తేడాలు, పనులు ఒకే చోట చేసి మరో చోట లోకేషన్ చూపడం, ఫొటోలు అప్‌లోడ్ చేయకపోవడం, ఎఫ్‌ఏల్లేని చోట టీఏలే అంతా తామై వ్యవహరించడంతో సోషల్ ఆడిట్‌లో రికవరీలను భారీగా పెట్టారు.

బాగానే స్వాహా..

ఉపాధి హామీ పనుల కొలతల్లో తేడాలను చూపి ఆయా పంచాయతీల్లో బాగానే స్వాహా చేశారు. దీనికి సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటంతో అస్తవ్యస్తంగా ఎం బుక్కులను రికార్డు చేశారని సమాచారం. సోషల్ ఆడిట్ కోసం వెళ్లిన బృందాలు సైతం ముక్కున వేలేసుకునేలా వీటిని నమోదు చేశారు. మస్టర్లలో మాయాజాలంతో పాటు కొలతల్లో 50 శాతం మేర తేడా చూపారు. ఉదాహరణకు చెరువు కట్టపై 500 మీటర్ల మట్టి పోసినట్లు రికార్డు ప్రకారం ఉంటే పనుల పరిశీలనలో 100 మీటర్లే ఉందని లెక్క తేల్చారు. పనులకు సంబంధించిన ఫొటోలను మండల స్థాయి సోషల్ ఆడిట్ సమయానికి సైతం టీఏలు అప్‌లోడ్ చేయకపోవడంపై డ్వామా పీడీ విస్తుపోయారు. ఫలితంగా రూ.74 లక్షలను రికవరీ పెట్టారు. ఇందులో ఇద్దరు టీఏలే అధికంగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.



మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు (ఫైల్)

టీఏల కనుసన్నల్లోనే..

ఎఫ్‌ఏలు లేని పంచాయతీలతో పాటు ఉన్న చోట్ల సైతం టీఏల కనుసన్నల్లోనే పనులు జరిగాయి. దీనికి కొందరు నేతలు సహకారం అందించినా పనులను రికార్డు చేసేది టీఏలు కనుక వారి మెడకే ఇప్పుడు రికవరీల బెడద చుట్టుకుంది. సోషల్ ఆడిట్ అంటే లెక్కలేకుండా పనులను ఇష్టానుసారం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో వారు రికార్డు చేసిన పనుల్లేకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిరదవోలు పంచాయతీలో అత్యధికంగా రూ.23.14 లక్షల మేర రికవరీ పెట్టారు. నేదురుమల్లిలో రూ.16 లక్షలు, పొదలకూరులో రూ.17.53 లక్షలను రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. ఆల్తుర్తిలో రూ.65 వేలు, అయ్యగారిపాళెంలో రూ.1.29 లక్షలు, చాటగొట్లలో రూ. 4.19 లక్షలు, చెన్నారెడ్డిపల్లిలో రూ.50 వేలు, నావూరులో రూ.69,488, తాటిపర్తిలో రూ.44,905, వెలికంటిపాళెంలో రూ.2.45 లక్షలు, విరువూరులో రూ.1.66 లక్షలు, ఇనుకుర్తిలో రూ.50,500, దుగ్గుంటలో రూ.66,719, బత్తులపల్లిలో రూ.26,137 రికవరీ విధించారు.

మొత్తం 1707 పనులు

మండలంలో మొత్తం 1707 పనులను పూర్తి చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 1451 పనులకు కూలీలతో రూ.8.8 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.73 లక్షలు.. మొత్తం రూ.9.53 కోట్ల పనులను పూర్తి చేశారని తెలుస్తోంది. మిగిలిన పనులను పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ ఫారెస్ట్ ద్వారా పూర్తి చేశారని చెప్తున్నారు.



సోషల్ ఆడిట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ (ఫైల్)

అంతా మాయాజాలం

2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూటమి ప్రభుత్వంలో మస్టర్ల మాయాజాలం కొనసాగుతూనే ఉంది. దీనికి టీఏల పూర్తి సహకారం ఉందని తెలుస్తోంది. ఫీల్డ్ అసిస్టెంట్లు చాలా మంది స్వచ్ఛందంగా మానేయడంతో మేట్ల ద్వారా పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇష్టానుసారం మస్టర్లను వేసుకుంటున్నారని తెలుస్తోంది. ఉపాధి పనులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల పనులకు హాజరయ్యే కూలీల ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి రావడంతో మస్టర్లలో అవకతవకలు కొంత మేర తగ్గాయి.

మానేసిన ఎఫ్‌ఏలు

గత ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేసిన సగం మంది కూటమి ప్రభుత్వం వచ్చాక స్వచ్ఛందంగా మానేశారు. అయితే వారు అధికారికంగా రాజీనామా చేయకపోవడంతో ఉపాధి అధికారులు వీటిని సమర్పించాల్సిందిగా ఒత్తిడి తీసుకొస్తున్నారు. పనులు చేయించేందుకు కొందరు సుముఖంగా ఉన్నా, ఆయా పంచాయతీల్లో అధికార పార్టీ నేతల ఒత్తిడిని తట్టుకోలేక మానుకున్నారు. పనులు ప్రస్తుతం మందకొడిగా జరుగుతున్నాయి. మండలంలోని మూడు పంచాయతీల్లోనే పనులు జరుగుతున్నాయి.

క్లుప్తంగా

వైభవంగా జానకిరాముని గ్రామోత్సవం



ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో జానకిరాముని గ్రామోత్సవం శనివారం అర్ధరాత్రి వైభవంగా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విద్యుద్దీపాలంకరణలతో మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామివారికి పండ్లు, కొబ్బరికాయ కర్పూర హారతులు పట్టి వేడుకున్నారు. ఉభయకర్తలుగా స్థానికులు కేతిరెడ్డి సతీష్‌రెడ్డి– విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. గ్రామోత్సవం సందర్భంగా వీధులు సందడిగా మారింది.

నేత్రపర్వం సీతారాముల రథోత్సవం



పొదలకూరు: పట్టణంలోని శ్రీరామ మందిరంలో నిర్వహిస్తున్న నవమి వేడుకల్లో భాగంగా రథోత్సవాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. పట్టణంలో వేడుకగా సాగింది. కర్పూరాన్ని భక్తులు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. తరుగు ప్రభాకర్, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కానుగ ఆకుపై అంబేడ్కర్ చిత్రం



పొదలకూరు: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని మహ్మదాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య కానుగ ఆకుపై ఆయన చిత్రాన్ని రూపొందించారు. ఇలా కళాత్మకంగా నివాళులర్పించారు.

ప్రసన్న ఆశీర్వాదం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్(కొడవలూరు) : మండలంలోని వెంకన్నపురంలో ఏపీఎల్‌డీఏ డైరెక్టర్ మందపల్లి మల్లికార్జున కుమారుడి వివాహానికి ఆదివారం కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులైన సంపత్ కుమార్–లక్ష్మీపద్మజను ఆశీర్వదించారు. నాయకులు ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వీరిచలపతిరావు, చెర్లో సతీష్‌రెడ్డి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, బాలశంకర్‌రెడ్డి, శివుని నరసింహులురెడ్డి పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు, చిన్నారులు

ఇందుకూరుపేట : పల్లిపాడులోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవ తదితర మతాలకు సంబంధించిన ప్రార్థనలు చేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల తొలుత గాంధీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1980 – 85 మధ్య విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మనుబోలు కోదండరామపురంలోని పద్మావతి ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో ఉన్న వారందరూ హాజరయ్యారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ సందడి చేశారు. విద్య నేర్పిన గురువు తెలుగు పండిట్ రామానుజాన్ని ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. సమన్వయకర్తగా పూర్వ విద్యార్థిని కాంద్ర పద్మావతి వ్యవహరించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

పొదలకూరు: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకు వారోత్సవాలను నిర్వహించనున్నామని ఫైర్ అధికారి విజయవరకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిప్రమాదాలపై రోజుకో అంశంపై ప్రజలను చైతన్యపర్చనున్నామని చెప్పారు.

హైస్కూల్ ప్లస్ విద్యార్థుల ప్రతిభ

మనుబోలు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మనుబోలు హైస్కూల్ ప్లస్ సీనియర్ ఇంటర్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సీనియర్ ఇంటర్ విద్యార్థి చరిష్మ 941 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. 902 మార్కులతో సుభాషిణి ద్వితీయ, 888 మార్కులతో హర్షిణి తృతీయ, 878 మార్కులతో చంద్రిక నాలుగో స్థానంలో నిలిచారు. కాగా ప్రథమ సంవత్సరంలో 14 మందికి గానూ ఎనిమిది మందే ఉత్తీర్ణులయ్యారు.

అంబేడ్కర్‌కు నివాళి



ముత్తుకూరు: మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ ఏడో తరగతి విద్యార్థి నవీద్ ప్లాస్టిక్ క్యాన్‌పై కార్వింగ్ ఆర్ట్‌తో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రాన్ని రూపొందించారు. తెలుగు పండిట్ సోమా పద్మారత్నం పర్యవేక్షణలో చిత్రానికి రంగులద్ది ఆవిష్కరించారు.

నందివాహనంపై శివపార్వతుల విహారం



మనుబోలు: సంగమేశ్వర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నంది వాహనంపై శివపార్వతులు విహరించారు. ప్రత్యేక పూజలను అర్చకుడు ఫణీంద్రశర్మ, సాయిశర్మ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చి ట్రాక్టర్‌పై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అడుగడుగునా గ్రామస్తులు స్వామివారికి కొబ్బరికాయలు, పండ్లు, పూలను నైవేద్యంగా సమర్పించి మంగళహారతులు పట్టారు. ఉభయకర్తగా మాల్యాద్రి వ్యవహరించారు. డీజే, మంగళవాయిద్యాలు, తప్పెట్లు భక్తులను అలరించాయి.

ఘనంగా మట్టల ఆదివారం



కోవూరు మండల కేంద్రంలో..

కోవూరు : కోవూరులోని సెంటినరి తెలుగు బాప్టిస్టు చర్చిలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘకాపరి రాజేష్ దైవ సందేశం ఇచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు.

గ్రామాల్లో..

విడవలూరు : మండలంలోని అన్ని చర్చిలలో మట్టల ఆదివారం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చిలోని సంఘస్తులు ఈత మట్టలు, పువ్వులతో అలంకరించుకుని భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం చర్చి పాస్టర్ బి.లూకరాజు మాట్లాడుతూ ప్రజలు దేవుని పట్ల నిజమైన విశ్వాసం కలిగి ఉండాలన్నారు. క్రీస్తును పోలి నడుచుకోవాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు.



విడవలూరు తెలుగు బాప్టిస్టు చర్చిలో..

‘జూనియర్’ ఫలితాల్లో డీలా



యాజమాన్యాల వారీగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో..

యాజమాన్యం	కళాశాలల సంఖ్య	హాజరైనవారు	ఉత్తీర్ణత సాధించిన వారు	శాతం
ప్రభుత్వ	24	2,283	1,213	53.13
మోడల్ స్కూల్స్	11	840	411	48.92
ఎయిడెడ్	2	165	42	25.45
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	6	472	440	93.22
హైస్కూల్ ప్లస్	16	304	144	47.36
కేజీబీవీ	12	294	194	65.98
అన్ ఎయిడెడ్	110	21,914	16,838	76.83

- రాణించలేకపోయిన సర్కార్ విద్యార్థులు
- అధ్యాపకుల కొరత కారణమంటూ విమర్శలు

నెల్లూరు (టౌన్) : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం బాగా తగ్గింది. రెగ్యులర్ అధ్యాపకుల కొరత, ఆయా యాజమాన్యాల పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులు తక్కువ శాతం ఉత్తీర్ణులయ్యారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ద్వితీయ సంవత్సరంలో తక్కువ శాతం ఫలితాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా ప్రభుత్వ యాజమాన్యాల్లో పనిచేస్తున్న అధికారులు కళాశాలల ప్రిన్సిపల్స్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 50 శాతం ఉత్తీర్ణత దాటడం గగనంగా మారితే ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం ఫర్వాలేదన్న చందంగా నెట్టుకొచ్చారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎయిడెడ్ యాజమాన్య కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 25.45 శాతం ఉంటే కేజీబీవీల్లో ఉత్తీర్ణత 65.98 శాతం మాత్రమే ఉంది. మొత్తంగా ప్రభుత్వ యాజమాన్య కళాశాలల ఉత్తీర్ణత శాతం 56.08 శాతంగా ఉంది. ప్రైవేటు యాజమాన్యాల్లోని కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 76.83గా ఉంది. అదే ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో ఎయిడెడ్ యాజమాన్యంలోని కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 57,83 శాతం ఉంటే, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 99.29 శాతంగా ఉంది. అదే ప్రైవేటు యాజమాన్య కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 88.82 శాతంగా ఉంది.

ద్వితీయ సంవత్సర ఫలితాలు

యాజమాన్యం	కళాశాలల సంఖ్య	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	శాతం
ప్రభుత్వ	24	1,796	1,353	75.33
మోడల్ స్కూల్స్	11	606	473	78.05
ఎయిడెడ్	2	166	96	57.83
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	6	427	424	99.29
హైస్కూల్ ప్లస్	16	184	150	81.52
కేజీబీవీ	12	168	144	85.71
అన్ ఎయిడెడ్	110	19,373	17,209	88.82

బుచ్చిలో ఈదురుగాలుల బీభత్సం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి ఫ్లెక్సీలు, హోర్డింగులు ఊడి కిందపడ్డాయి. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణం చల్లబడటంతో సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఈదురుగాలులతో వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుమ్ము కమ్ముకోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.



ఈదురుగాలులకు ఊడిపడిన ఫ్లెక్సీ